క్లుప్తంగా

నూతన ఆవిష్కరణలతో జ్ఞాన వికాసం


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్

ఒంగోలు సెంట్రల్: విద్యార్థులు చిన్న తనం నుంచే నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని పేస్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ జి. విజ్జి బాబు అన్నారు. ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రీనియర్ షిప్ (ఐఐసీ)లో భాగంగా వల్లూరు జిల్లా పరిషత్ పాఠశాలలో రెండు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులతో శనివారం మాట్లాడారు. శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించడంతో పాటు శాస్త్రవేత్తల జీవితాలను అధ్యయనం చేయాలన్నారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, స్టూడెంట్స్ అఫైర్స్ డీన్ డాక్టర్ వీరాంజనేయులు, సివిల్ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ గనేష్ నాయుడు పాల్గొన్నారు.

సిట్ విచారణ వేగవంతం చేయాలి

ఒంగోలు టౌన్: జిల్లాలో జరిగిన భూ కబ్జాలు, నకిలీ స్టాంపుల కుంభకోణంలో నాటి ప్రభుత్వం వేసిన సిట్ విచారణ వేగవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఒంగోలులో కొంతమేర సిట్ విచారణ జరిపినప్పటికీ మార్కాపురం, కనిగిరి ప్రాంతాల్లో విచారణ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా సాగిందన్నారు. జిల్లాలోని బాధితులకు సీపీఐ అండగా నిలుస్తుందని, ఈ నెల 19వ తేదీన బాధితులతో కలిసి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తామని తెలిపారు.

ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

ఒంగోలు సెంట్రల్: నిరుద్యోగ యువతకు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగళూరులో కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి, ఉద్యోగ అవకాశం కల్పిస్తామని సంస్థ అడ్మిషన్స్ కోఆర్డినేటర్ హరి ప్రసాద్ తెలిపారు. 35 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, శిక్షణ కాలంలో భోజనం, వసతి కల్పిస్తామని చెప్పారు. వివరాలకు 9000487423 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పారిశుద్ధ్య కార్మికుల సర్వేకు సహకరించండి

ఒంగోలు సెంట్రల్: సుప్రీం కోర్టు, ప్రభుత్వ ఆదేశాల మేరకు పారిశుద్ధ్య కార్మికులను, ఇన్ శానిటరీ లెట్రిన్స్ సర్వేను సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమాధికారి లక్ష్మానాయక్ తెలిపారు. జిల్లాలోని పారిశుద్ధ్య కార్మికులు, ఇన్ శానిటరీ లెట్రిన్స్‌గా ఉన్న వారు వారి దరఖాస్తును ఈనెల 26లోపు సాంఘిక సంక్షేమశాఖ కార్యాలయంలో అందించి సహకరించాలని కోరారు. దరఖాస్తుతో పాటు కులం, విద్యార్హత, చిరునామా, ఫొటో, ఆధార్, ఓటరు కార్డుతో పాటు మాన్యువల్ స్కావెంజర్స్, సఫాయి కర్మచారీల సంక్షేమం కోసం పనిచేస్తున్న సంస్థలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా జత చేయాలని వివరించారు.


ఎండిపోయిన ఉప్పుగుండూరు చెరువు


బావిలోకి వేసిన బోరు



ఆక్స్‌ఫర్డ్ పాఠశాల

దర్జాగా నీటి చౌర్యం

- ప్రభుత్వ బావిలోకి ప్రైవేటు బోరు
- బావి, రోడ్డు పగులగొట్టి బోరు బిగించిన పాఠశాల యాజమాన్యం
- గ్రామంలో చుక్క నీరు లేక ప్రజలు అవస్థలు

నాగులుప్పలపాడు: ప్రైవేటు వ్యక్తుల అత్యాశ మేజర్ గ్రామ పంచాయతీకి తాగు నీటి కష్టాలు తెచ్చి పెడుతున్నాయి. స్వార్థ బుద్ధితో ఓ ప్రైవేటు పాఠశాల యాజమాన్యం వ్యవహరిస్తోన్న తీరు సభ్య సమాజం తలదించుకొనేలా ఉంది. పంచాయితీ వారి అనుమతులు కూడా లేకుండా రాత్రికి రాత్రే 200 మీటర్ల మేర ప్రభుత్వ రోడ్డు, బావులు పగులగొట్టి సొంత బోరు బిగించుకొని నీటిని దోచేస్తోంది ఉప్పుగుండూరులోని ఆక్స్‌ఫర్డ్ స్కూలు యాజమాన్యం. ఖరీఫ్ సీజన్ దాటిపోతున్నా సరైన వర్షాలు పడగక మండలంలో చెరువులు, కుంటలు, బావులు ఎండిపోయి తీవ్రమైన నీటి ఎద్దడి నెలకొంది. ఈ క్రమంలో 12 వేల జనాభా కలిగిన ఉప్పుగుండూరు గ్రామానికి ప్రధాన నీటి వనరు ఊర చెరువు మాత్రమే. ప్రస్తుతం ఎండిపోయిన ఈ చెరువు గ్రామస్తుల దాహార్తి తీర్చలేకపోతోంది. ఈ క్రమంలో ఇటీవల పంచాయతీ పాలకవర్గం నిధులను వెచ్చించి గ్రామంలో వాడుకలో ఉన్నవి, లేనివి సుమారు 26 బావులను శుభ్రం చేయించారు. దీంతో ఆయా బావుల్లో కొంత మేర భూగర్భ జలాలు రావడంతో కొంత ఉపశమనం లభించింది. అయితే ఆక్స్‌ఫర్డ్ పాఠశాల హాస్టల్ విద్యార్థులు, సిబ్బందికి నీటి అవసరాలకు బోర్లు వేయించాటంటే భారీ ఖర్చు చేయాలి. ట్యాంకర్లతో నీటిని కొనుగోలు చేయాలంటే లక్షల్లో ఖర్చు పెట్టాలి. దీంతో ప్రభుత్వం మరమ్మతులు చేయించిన బావిలోకి రాత్రికి రాత్రే బోరు దించారు. పాఠశాల నుంచి ఇది 200 మీటర్ల దూరం ఉండగా.. అడ్డుగా ఉన్న సీసీ రోడ్డును, బావిని కూడా పగులగొట్టి బోరు దించేశారు.


బావిని పగులగొట్టి పైపులు తొడిగిన పాఠశాల యాజమాన్యం

చర్యలు తీసుకుంటాం

ప్రభుత్వ బావుల్లో ప్రైవేటు వ్యక్తులు ఇలా అక్రమంగా బోర్ల ఏర్పాటుపై గ్రామ పంచాయతీ కార్యదర్శి బెన్హర్‌ను వివరణ కోరగా ఇటీవల గ్రామంలో నీటి ఎద్దడి దృష్ట్యా బావులను వాడుకలోకి తెచ్చామన్నారు. కానీ ప్రైవేటు వ్యక్తులు బోర్లు వేసి నీటిని తరలించడం నేరమని.. పంచాయతీ బావిలోకి బోరు ఏర్పాటు కోసం ఏ పాఠశాల యాజమాన్యం కూడా అనుమతులు తీసుకోలేదన్నారు. ఈ ఘటనపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు.


పైప్ లైన్ నిర్మాణం కోసం పగులగొట్టిన సీసీ రోడ్డు

మృగాళ్లను కఠినంగా శిక్షించాలి



చీమకుర్తి బస్టాండ్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న డాక్టర్‌లు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు


కొత్తపట్నంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైష్ణవి, మెడికల్ సిబ్బంది

చీమకుర్తి: కోల్‌కతాలో డ్యూటీలో ఉన్న ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వ, ప్రైవేటు డాక్టర్‌లు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ట్రైనీ డాక్టర్‌పై జరిగిన దారుణాన్ని ఖండిస్తూ శనివారం చీమకుర్తిలోని ప్రభుత్వ ఆస్పత్రి వద్ద నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ వద్ద జరిగిన సమావేశంలో డాక్టర్ బి.జవహర్, డాక్టర్ సురేఖ, లయన్స్‌క్లబ్ డైరెక్టర్ చలువాది రమేష్, స్థానికులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఇలాంటి సంఘటనలు హేయమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, నిందితులను వెంటనే అరెస్ట్ చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు.

కొత్తపట్నం: కోల్‌కతా నగరంలో విధుల్లో ఉన్న డాక్టర్‌పై జరిగిన హత్యాచారం అత్యంత జుగుప్సాకరమని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ వైష్ణవి అన్నారు. శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బస్టాండ్ కూడలి వరకు మెడికల్ సిబ్బందితో భారీ ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో మానవహారం చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రజల ప్రాణాలను కాపాడుతూ నిత్యం వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లను హత్యాచారాలు, హత్యలు చేయడం ఏమిటని ఆవేదన చెందారు. నిందితులకు ఉరి వేయాలి..మహిళలపై జరుగుతున్న హత్యలు, దాడులు పునావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కూడా ప్రభుత్వ, ప్రవేటు హాస్పిటళ్లలో ఓపీ చూడమని తెలిపారు. పాఠశాల హెచ్‌ఎం ఎం.శ్రీదేవి, శరత్ చంద్ర, డాక్టర్ రమ్యదీపక, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ వాణి

ఒంగోలు రూరల్: పవిత్రమైన వృత్తిలో ఉన్న వైద్యులకు రక్షణ లేకపోయిందని కరవది వైద్యశాల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.వాణి అన్నారు. వైద్యశాల నుంచి హై స్కూల్ వరకు గ్రామ వీధుల్లో భారీ ర్యాలీ జరిపారు. హై స్కూల్ హెచ్ఎం రవి కుమార్ వెంటనే దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

పారిశుద్ధ్య లేమి.. రోగాల కొలిమి


బీసీ కాలనీలో మురుగు


ప్రాథమిక పాఠశాల ఎదురుగా ఉన్న కాలువలో పేరుకుపోయిన పూడిక

మద్దిపాడు: మండల కేంద్రమైన మద్దిపాడు బీసీ కాలనీలో పారిశుద్ధ్యం పడకేసింది. ఇక్కడ సైడు డ్రైన్లు లేకపోవడంతో కాలనీలో మురుగు చేరి దోమలు పెరిగాయి. ఫలితంగా విష జ్వరాలు, డెంగీ, మలేరియా ప్రబలుతాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ప్రాథమిక పాఠశాల రామాలయం వద్ద నెలలుగా మురుగు నిలిచిపోయింది. మరోవైపు తాగు నీటి సరఫరా కూడా జరగడం లేదు. కాలనీలో చెత్త సేకరించడానికి ట్రాక్టర్ కూడా రావడంలేదు.

ప్రశాంతంగా చైర్మన్ ఎన్నిక


కొత్తపట్నంలో కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు

కొత్తపట్నం: స్థానిక బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎంపిక పూర్తయింది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోధ్యాయురాలు ఎం.శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. పాఠశాలలో 1,350 మంది విద్యార్థులు ఉండటంతో గతంలో తల్లిదండ్రులు అంతా రాకపోవడంతో కోరం సరిపోక ఎస్ఎంసీ ఎన్నిక వాయిదా పడింది. కాగా 3, 4 తరగతులకు కోరం సరిపోవడంతో ఎన్నిక జరిగింది. తిరిగి ఈ నెల 17న న పాఠశాలలకు మిగతా ఎన్నిక జరపాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం అందించారు. కాగా 18 మంది డైరెక్టర్లు ఎంపిక చేసుకుని చైర్మన్‌గా చనివిని వంశీకృష్ణారెడ్డి, వైస్ చైర్మన్‌గా గొరబోయిన సునీత ఎంపిక చేసుకున్నారు. వారికి ప్రధానోపాధ్యాయురాలు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో శని త్రయోదశి పూజలు


శనీశ్వరునికి పూజలు చేస్తున్న మహిళలు

ఒంగోలు మెట్రో: శ్రావణమాసం శనివారం త్రయోదశి శని త్రయోదశి సందర్భంగా నగరంలోని శివాలయాల్లో శనీశ్వరునికి ప్రత్యేక తైలాభిషేకాలు నిర్వహించారు. స్థానిక కేశవస్వామి పేటలోని శివాలయంలోని నవగ్రహాలకు, ఇతర ఆలయాల్లో పూజలు జరిగాయి.

శ్రీశైల శిఖర దర్శనం మోక్షదాయకం

శ్రావణమాసంలో శ్రీశైల భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆరాధన ఐశ్వర్యాన్ని, ఐదోతనాన్ని అందిస్తాయని ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు, ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకులు పొన్నూరు శ్రీనివాసులు అన్నారు. శ్రావణ మాసాన్ని పురస్కరించుకు శ్రీశైల దేవస్థానంలో ధర్మానిధి వేదికపై శనివారం ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు.

పవిత్రోత్సవాలు..

ఒంగోలు కొండమీద శ్రీగిరి వేంకటేశ్వర స్వామి పవిత్రోత్సవాలను ఆదివారం నుంచి మంగళవారం వరకు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. ఈమేరకు ఆలయ ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి వెల్లడించారు.


నూతనంగా నిర్మించిన సెపక్ తక్రా కోర్టు


దాతలు అందించిన బల్లలు సైతం చిల్లచెట్లలోనే..


వాకింగ్ ట్రాక్ చుట్టూ పొదలు..పాముల భయం

ఉత్సాహానికి ఉరి

- ఆందోళనకరంగా మినీ స్టేడియం నిర్వహణ
- రన్నింగ్ ట్రాక్ వేసి నెల కూడా కాకుండానే భారీగా వచ్చిన పిచ్చి మొక్కలు
- ఎర్రమట్టికి బదులు నల్లమట్టిపోస్తున్నా ప్రశ్నించని అధికారులు
- గ్రౌండు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఉన్నా వెంటాడుతున్న పాముల భయం
- దాతలు స్పందించి బల్లలు అందించినా అవి కూడా నిరుపయోగమే!

ఒంగోలు: క్రీడా ప్రాంగణం అంటే చిన్నారులు, పెద్దలు కూడా ఉత్సాహంగా వస్తారు. గ్రౌండులోకి అడుగుపెట్టగానే తమ చిన్ననాట మధుర స్మృతులు నెమరువేసుకోని వారు ఉండరు. కానీ ఒంగోలు మినీ స్టేడియం అందుకు భిన్నం. గ్రౌండులోకి అడుగుపెట్టిన ప్రతి ఒక్కరికీ మనస్సు చివుక్కుమనే పరిస్థితి నెలకొంది. కనీస నిర్వహణ కూడా లేకపోవడంతో క్రీడాకారులతోపాటు క్రీడాభిమానులు ఆవేదన చెందుతున్నారు. గడ్డి విస్తారంగా పెరిగి ఆడుకునేందుకు ఇబ్బందికరంగా మారింది. నెల రోజుల క్రితం శాప్ ఆదేశాలతో కొంతమంది గ్రౌండులో 200 మీటర్ల రన్నింగ్ ట్రాక్, వాలీబాల్ కోర్టు, సెపక్ తక్రా కోర్టులను నిర్మించారు. ఈ ట్రాక్‌పై క్రీడాకారులు పరిగెత్తాలంటే నేల గట్టిగా ఉండాలి. కానీ అందుకు భిన్నంగా నల్లమట్టి (పొలం మట్టి) పోశారు. దీంతో మనిషి అడుగు తీసి అడుగేస్తుంటే కాళ్లకింద మట్టి అంటుకుపోతోంది. పట్టుమని నెలరోజులు దాటిందో లేదో కానీ ట్రాక్, వాలీబాల్, సెపక్ తక్రా కోర్టుల్లో పిచ్చి మొక్కలు పెద్ద ఎత్తున పెరిగిపోయాయి. కనీసం వాటిని తొలగించేందుకు ఎవరూ ముందుకు రావడంలేదు. చివరకు దాతలు ఇచ్చిన బల్లలు సైతం చిల్లచెట్లలోనే ఉండిపోయి నిరుపయోగంగా మారాయి. ఈ స్టేడియంకు ఒక జిల్లా ఇన్‌చార్జి క్రీడాభివృద్ధి శాఖ అధికారి, ఒక బాక్సింగ్ కోచ్, ఒక సెపక్ తక్రా కోచ్, ఒక బాస్కెట్‌బాల్ కోచ్, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్, ఒక వాచ్‌మన్, ఒక స్వీపర్ విధులు నిర్వహిస్తున్నారు. కానీ గ్రౌండుమెన్, గార్డెనర్ లేకపోవడంతో ఆట స్థలంలో ఆహ్లాదానికి బదులు ఆనందం ఆవిరైపోయే పరిస్థితి నెలకొంది.


క్రీడాభివృద్ధి అధికారి కార్యాలయం వెనుక వైపు పొదలు


చెల్లచెట్లతో మూసుకుపోయిన ఉత్తర ద్వారం


నూతనంగా నిర్మించిన వాలీబాల్ గ్రౌండు


200 మీటర్ల వాకింగ్ ట్రాక్‌పై పిచ్చిమొక్కలు

108లో గర్భిణి ప్రసవం


108లో బిడ్డకు జన్మనిచ్చిన మరియమ్మ

దొనకొండ: మండలంలోని మంగినపూడి గ్రామానికి చెందిన మరియమ్మ ప్రసవ వేదన అధికం కావడంతో 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. వెంటనే దొనకొండ నుంచి వాహనం మంగినపూడి చేరుకుని మార్కాపురం ప్రభుత్వ ఆస్పత్రికి గర్భిణిని తరలిస్తుండగా మార్గమధ్యంలో సిద్దాయపాలెం వద్ద మరియమ్మ పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. అంబులెన్స్ సిబ్బంది ఎమెర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ బాలజ్యోతి ప్రథమ చికిత్స చేసి సుఖ ప్రసవం చేశారు. విషయం తెలుసుకున్న మరియమ్మ కుటుంబ సభ్యులు, 108 అంబులెన్స్ సిబ్బందికి, మేనేజర్ విజయకుమార్, పొదిలి డివిజన్ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ రాజేంద్ర ప్రసాద్‌కు అభినందనలు తెలిపారు.